సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
ఆదివారం । 24 । మార్చి । 2024



కృత్రిమం వద్దు..
హోలీ వేడుకల్లో కృత్రిమ రంగులు చల్లు కోవడం వల్ల అనారోగ్య సమస్యలు తప్పవని వైద్య నిపుణులు అంటున్నారు.
- 8లో▸



గంజాయి మత్తులో ..
వరంగల్ నగరంలోని శంభునిపేటలో ఆకతాయిలు పెట్రేగిపోతున్నారు. మద్యం, గంజాయి మత్తులో బెదిరింపులకు తెగపడుతున్నారు.
- 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38^0 /23^0
జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరగడంతోపాటు ఉక్క పోతగా ఉంటుంది. రాత్రివేళ ఆహ్లాదకరంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

టెన్త్ పరీక్షకు 14 మంది గైర్హాజరు



విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని 68 పరీక్ష కేంద్రాల్లో శనివారం నిర్వహించిన గణితం పరీక్షలో 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 12,032 మందికిగాను 12.018 మంది హాజరుకాగా.. (99.88 శాతం), ప్రైవేట్ అభ్యర్థులు 125 మందికిగాను 117 మంది (93.6శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్ రెండు పరీక్ష కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ రెండు పరీక్ష కేంద్రాలను, డీఈఓ 11, ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు 24 కేంద్రాలను తనిఖీ చేశారు.

వరంగల్ జిల్లాలో.. 16 మంది గైర్హాజరు

కాశీబుగ్గ సెంటర్ : వరంగల్ జిల్లాలో శనివారం నిర్వహించిన టెన్త్ గణితశాస్త్రం పరీక్షకు 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ వాసంతి తెలిపారు. మొత్తం 9,477 మంది విద్యార్థులకు 9,461 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. కలెక్టర్ ప్రావీణ్య నరేంద్రనగర్ ప్రభుత్వ హైస్కూల్, లర్నర్స్ ల్యాండ్ స్కూల్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీ

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని శనివారం కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా చక్కగా.. పరీక్షలు రాయాలని సూచించారు. సీసీ కెమెరాల పనితీరుపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

ఏసీపీ జితేందర్‌రెడ్డికి కాంస్య పతకం



వరంగల్ క్రైం: హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఈనెల 17 నుంచి 22 వరకు జరిగిన 16వ ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో ఏసీపీ జితేందర్‌రెడ్డి ప్రతిభ కనబర్చి కాంస్య పతకాన్ని సాధించారు. వరంగల్ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న జితేందర్ రెడ్డి జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగం తరఫున 55 ఏళ్ల విభాగంలో బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో అడిషనల్ ఎస్పీ వెంకట్రావుతో కలిసి విజేతగా నిలిచి కాంస్య పతకాన్ని అందుకున్నారు. ఈమేరకు వరంగల్ సీపీ కార్యాలయంలో సీపీ అంబర్ కిషోర్ ఝూను.. ఏసీపీ జితేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పోలీస్ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిన ఏసీపీని సీపీ అభినందించారు.

'వందేభారత్'పై రాళ్ల దాడి.. అధికారుల విచారణ

కాజీపేట రూరల్: పెంబర్తి–ఆలేరు రైల్వే స్టేషన్ల మధ్య వందేభారత్ రైలుపై గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రాళ్ల దాడి చేయడంతో కిటికీ అద్దాలు పగిలినట్లు శనివారం కాజీపేట ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవరావు తెలిపారు. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎవరికీ గాయాలు కాలేదని, ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా.. ఇటీవల కోమటిపల్లి రైల్వే గేట్ సమీపంలో రైల్వే కేబుల్స్ కట్ చేసిన ఘటనలో ఒకరిని అదుపులోకి తీసుకోని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఆరు రైళ్ల రద్దు పొడిగింపు

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధి వరంగల్, భద్రాచలం, విజయవాడ సెక్షన్‌లో ప్రయాణించే.. పలు ప్యాసింజర్ రైళ్లను రోలింగ్ కారిడార్ రైల్వే బ్లాక్ వర్క్స్‌తో ఈనెల 25 నుంచి ఏప్రిల్ 21 వరకు రద్దు చేసినట్లు శనివారం కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు.

రద్దయిన రైళ్లు..

కాజీపేట–బల్లార్షా (17035) అజ్నీ ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17036) అజ్నీ ప్యాసింజర్, భద్రాచలం–విజయవాడ (07278) సింగరేణి, విజయవాడ–భద్రాచలం (07979) సింగరేణి, సికింద్రాబాద్–వరంగల్ (07462) పుష్పుల్, వరంగల్–హైదరాబాద్ (07463) పుష్పుల్ ప్యాసింజర్.

అమ్మకు ఆలంబన

సువిశాల స్థలం.. అధునాతన హంగులతో వృద్ధాశ్రమం నిర్మాణం



రోడ్డుకు ఫర్లాంగు దూరంలో పెద్దగేటు.. గేటు తీసి లోపలికి అడుగుపెట్టగానే స్వాగతం పలికినట్లు సువాసనలు వెదజల్లే గులాబీ పూల మొక్కలు.. నాలుగు వరుసల్లో రాయల్ ఫాం చెట్లు.. ఎటుచూసినా నేలంతా పరుచుకున్న గ్రీనరీ.. అక్కడక్కడా సేదదీరేందుకు బల్లలు.. ఈ పచ్చటి సొబగుల మధ్య.. రాజసౌధంలా మెరిసే భవనం.. అందులో సకల సౌకర్యాలతో గదులు.. ఇదేదో అమెరికాలో ఉంటూ తల్లిదండ్రులను చూసుకోలేని వారి కోసం కట్టించింది కాదు.. ఆదరణ కోల్పోయిన నిరుపేద వృద్ధులకు జీవిత చరమాంకంలో ఆలంబన ఇచ్చేందుకు రూపుదిద్దుకున్న వృద్ధాశ్రమం. జనగామ జిల్లా కేంద్రంలోని సిద్దిపేట రోడ్డు శామీర్‌పేట శివారులో నిర్మించిన ఈ ఓల్డేజ్ హోమ్ ప్రత్యేకతలపై ఈ వారం సండే స్పెషల్ కథనం.

- వరంగల్ డెస్క్

రుద్రమదేవి మహిళా మ్యాక్స్ లిమిటెడ్.. జనగామ కేంద్రంగా విజయవంతంగా నడుస్తున్న మహిళల పొదుపు సంఘం. ఇందులో సుమారు 22వేల మంది సభ్యులున్నారు. 20 ఏళ్లుగా చిట్టీ కడుతున్న వారు ఒక రోజు సమావేశంలో.. 'ఇన్నాళ్లు చిన్నకొడుకు.. పెద్ద కొడుకులా.. భావించి చిట్టీ కట్టాం. ఇప్పుడు వయసైపోతోంది. వృద్ధాప్యంలో మమ్మల్ని చూసేవారెవరు?.. మనలాంటి వాళ్లు చాలామంది ఉన్నారు. ఓ వృద్ధాశ్రమం నెలకొల్పుదాం'అని అన్నారు. ఇందుకు మిగతా సభ్యులు కూడా ఒకే చెప్పారు. అప్పటికే వారికి శామీర్‌పేట సమీపంలో 12 ఎకరాల స్థలం ఉంది. కానీ.. భవనం కట్టించేవారెవరు అనే మీమాంసలో పడ్డారు. అందరూ కలిసి ఓ రోజు అప్పటి భువనగిరి ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వద్దకు వెళ్లి విషయం చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ఉండాలని, అందుకు తమ భూమిని ఇస్తామని చెప్పారు. దీంతో ఆయన తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.13కోట్లతో ఆధునిక హంగులతో భవనం నిర్మించి ఇచ్చారు.

ఓల్డేజ్ హోమ్ ప్రత్యేకతలు..

మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థలంలో ఎకరంన్నరలో వృద్ధాశ్రమం ఉంది. మిగిలిన స్థలాల్లో మొక్కలు, గ్రీనరీ పెంచుతున్నారు. ఇందులో 126 మంది వృద్ధుల కోసం సకల సౌకర్యాలు కల్పించారు. 8 బ్లాక్‌లుగా విభజించి, ఏడుగురు వృద్ధులు, మరొకటి సిబ్బంది కోసం కేటాయించారు. ఒక్కో బ్లాక్‌లో 18 మంది వృద్ధులు ఉంటారు. ప్రతీ బ్లాక్‌లో ఒక కేర్ టేకర్ ఉంటారు. ప్రతీ బ్లాక్‌లో అటాచ్డ్ బాత్‌రూమ్స్, వేడినీళ్ల కోసం గీజర్లు, దుస్తులు పెట్టుకునేలా.. అద్దంతో కూడిన ఆల్మారా.. అత్యవసర సమయంలో కేర్ టేకర్‌ను పిలిచేలా బెల్ అమర్చారు. ఆవరణలో గులాబీ మొక్కలు, రాయల్ ఫాం చెట్లు, సాయంత్రం హాయిగా కూర్చుని ముచ్చటించుకునేలా బల్లలు, వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. వృద్ధులందరూ ఒకేసారి భోజనం చేసేలా పెద్ద డైనింగ్‌హాల్, కాలక్షేపం కోసం ప్రత్యేక హాల్ నిర్మాణం చేపట్టి, అందులో 65 ఇంచుల ఎల్‌ఈడీ టీవీని అమర్చారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఏసీ కిట్లను అమర్చారు.

డాక్టర్ సెల్ ప్రత్యేకం..

వృద్ధులకు అనారోగ్య సమస్యలు రావడం సహజం. దీంతో అత్యవసర సమయంలో వైద్య పరీక్షలు అందించేలా డాక్టర్ సెల్ ఏర్పాటు చేశారు. ఇందు కోసం ఎమర్జెన్సీ వార్డును ఏర్పాటు చేశారు. అందులో నాలుగు ఐసీయూ బెడ్లు, ఆక్సిజన్ సిలిండర్‌తోపాటు ఇద్దరు డాక్టర్లు, నలుగురు నర్సులు సేవలందిస్తారు. నిరంతర పర్యవేక్షణ కోసం 80 సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆశ్రమం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో సేంద్రియ పద్ధతుల్లో వరి, కూరగాయలు సాగు చేసేందుకు ఆలోచన చేస్తున్నారు. వృద్ధాశ్రమాన్ని 75 శాతం ప్రభుత్వ నిధులు, మరో 25 శాతం రుద్రమదేవి సొసైటీ ఆధ్వర్యంలో నడపనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం జీఓ జారీ చేసింది.

- వందమంది ఆశ్రయం పొందే అవకాశం.. ఒంటరి భావన వీడేలా వాతావరణం
- రుద్రమదేవి మహిళా మ్యాక్స్ లిమిటెడ్ ఆశయానికి తోడుగా నిలిచిన కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్



కోమటిరెడ్డి సుశీలమ్మ ఓల్డేజ్ హోమ్‌లోని పరిసరాలు



అత్యవసర వైద్య విభాగంలోని బెడ్లు

సండే స్పెషల్

బ్లాక్‌లో వృద్ధులు ఉండేందుకు ప్రత్యేక బెడ్లు







పెద్దవాళ్లు పిల్లలతో సమానం..

మా అత్తమ్మ నాలుగేళ్లు పెరాలసిస్‌తో మంచం పట్టారు. మేం ఆర్థికంగా ఉన్నాం. అన్ని సపర్యలు చేశాం. అయినా.. ఆమెలో ఏదో లోటు. తన వయస్సు వారైన నలుగురూ మాట్లాడడం లేదని ఒంటరితనం. ఆమె పడిన ఆవేదనను నేను స్వయంగా చూశాను. రుద్రమదేవి మహిళా సొసైటీ వాళ్లు నా భర్త కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వద్దకు వచ్చి మాకు స్థలం ఉంది. భవన నిర్మాణం, వసతులకు సాయం చేయాలని అడిగారు. మా అత్తమ్మ పేరున ఉన్న సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించాం. ఓల్డేజ్‌హోమ్‌లో చేరిన వారు ఒంటరి భావన వీడేలా అన్ని వసతులు కల్పించాం.

- కోమటిరెడ్డి లక్ష్మి, కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్



వృద్ధాప్యం.. శాపం కావొద్దని

ప్రతీ మనిషి వృద్ధాప్యానికి రాక తప్పదు. కానీ ఆ వయస్సు.. వారికి శాపం కావొద్దని ఓల్డేజ్‌హోమ్ ఆలోచనకు వచ్చాం. అందుకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారం అందించారు. నేను ఫౌండర్‌గా ఉన్న సొసైటీ స్థలంలో రాజకీయాలకు అతీతంగా నిర్మించాలని అనుకున్నా. ఇది నేటికి నెరవేరింది. మా సభ్యులు కూడా ఎంతో సేవా తత్పరత ఉన్నవారు. వృద్ధులకు సేవ చేస్తే పుణ్యం వస్తుంది. అందులో నేను భాగస్వామిని అయినందుకు సంతోషంగా ఉంది.

- చిర్ర సుగుణ, రుద్రమదేవి మహిళా మ్యాక్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు



గర్వంగా ఫీలవుతున్నా..

వృద్ధులకు సేవ చేసే అవకాశం రావడం నా అదృష్టం. సీఈఓగా ఉన్నప్పటికీ కూడా ఇంత మంచి సేవ చేయడం గర్వంగా ఫీలవుతున్నా. ప్రతి నెలా కొంత మంది సభ్యులు ఇక్కడే ఉండేలా ప్రణాళిక రూపొందించుకున్నాం. అప్పుడు ఇక్కడ ఆశ్రయం పొందే వృద్ధులు తమ పిల్లలతో కలిసి ఉన్నట్లు భావిస్తారు. ఇక్కడ చేరిన వారు ఒంటరిగా ఉన్నామనే ఫీల్ కలగకుండా ప్రతీరోజు ఏదో ఒక అకేషన్, మ్యారేజ్ డేలు, బర్త్‌డేలు నిర్వహిస్తాం.

- పోగుల కవితారెడ్డి, రుద్రమదేవి మహిళా మ్యాక్స్ సొసైటీ సీఈఓ

గడువులోగా పనులు పూర్తి చేయండి

- నిర్లక్ష్యం లేకుండా ఇంజనీర్లు పర్యవేక్షించాలి
- క్షేత్రస్థాయి తనిఖీలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



భద్రకాళి బండ్ అభివృద్ధి పనుల్ని పర్యవేక్షిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ పోతన నగర్‌లో నిర్మించిన ల్యాండ్రో మార్ట్‌ను కమిషనర్ పరిశీలించారు. స్మార్ట్ సిటీ ప్రతినిధులు మార్ట్‌లో ఉన్న మిషన్‌ల పనితీరు ప్రక్రియతో పాటు యంత్రాల కమిషనింగ్, నిర్వహణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. భద్రకాళి బండ్‌పై వరదల సమయంలో కట్ట తెగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ వాల్వ్ నిర్మించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. ఆరేపల్లి సమీపంలోని గ్రాండ్ ఎంట్రెన్స్ నిర్మాణ, రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. స్టాం వాటర్ డ్రెయిన్ పైపులు ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ సంజయ్ కుమార్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి, డీఈలు రవికుమార్, రవికిరణ్, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ఖర్చు చేయాలి



సమీక్షిస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి

హన్మకొండ అర్బన్: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పోటీలో నిలిచే రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ఖర్చు చేయాలని అడిషనల్ కలెక్టర్ ఎ.వెంకటరెడ్డి అన్నారు. హనుమకొండ కలెక్టరేట్ శనివారం అభ్యర్థుల ఎన్నికల ప్రచార వ్యయంపై ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ ప్రచారానికి ఖర్చు చేయాల్సిన సామగ్రి ధరల పట్టికను పార్టీల ప్రతినిధులకు అందజేశారు. సమావేశంలో ఆర్డీఓలు వెంకటేశ్, నారాయణ, ఎన్నికల విభాగాధికారి ప్రసాదరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు నేహాల్, రజనీకాంత్, మణి, శ్యామ్, లక్ష్మణ్, జైపాల్‌రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

వరంగల్ అర్బన్: ప్రతీ పౌరుడు ఓటు నమోదు చేసుకుని వినియోగించుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి కోరారు. శనివారం వరంగల్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్వీప్–24 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటు హక్కు ద్వారా మాత్రమే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ కోలా రాజేశ్‌కుమార్ గౌడ్ లెక్చరర్లు మాలతి కృష్ణవేణి అనురాధ విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కిష్టాపురం చెక్ పోస్ట్ తనిఖీ

వరంగల్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. వరంగల్ జిల్లా రాయపర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన కిష్టాపురం ఎన్నికల చెక్ పోస్ట్, వర్ధన్నపేట శివారు డీసీ తండా చెక్‌పోస్టును శనివారం సీపీ అంబర్ కిషోర్ ఝూ తనిఖీ చేశారు. ఈసందర్భంగా చెక్ పోస్ట్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. వాహన తనిఖీల సమయంలో ప్రజలతో మర్యాద పూర్వకంగా మెలగాలని, ఎలాంటి ఇబ్బందులకు గురవకుండా జాగ్రత్త పడాలని, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. తనిఖీల్లో ఎస్సైలు సందీప్, కిరణ్‌కుమార్ ఉన్నారు.

ఆర్టీసీలో అధికారి చేతివాటం

- కిలోమీటర్లు పెంచి బిల్లు చెల్లించేందుకు డబ్బుల డిమాండ్
- ఆ అధికారి తీరు వేరు..
- వెలుగులోకి అకౌంట్స్ విభాగం ప్రధానాధికారి అవినీతి



హన్మకొండ: ఆర్టీసీలో అవినీతిపరులు పుట్టుకొస్తున్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఒకప్పుడు లెక్కల్లో అర్ధ రూపాయి తేడా వచ్చినా.. క్రమ శిక్షణ చర్యలు తీసుకుని, సస్పెండ్ చేసేవారు. ఉద్యోగం నుంచి తొలగించేవారు. ఎప్పుడైతే ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ విధానం, అద్దె బస్సులు ప్రవేశించాయో.. అప్పటి నుంచి అవినీతికి ఆస్కారం ఏర్పడిందని పరిశీలకులు చెబుతున్నారు. ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ విధానం, అద్దె బస్సుల ప్రవేశం తర్వాత బిల్లుల చెల్లింపుల విషయంలో క్రమంగా.. అధికారులు, సిబ్బంది చేతి వాటానికి పాల్పడడానికి అలవాటయ్యారు. ఈక్రమంలోనే గతంలో వరంగల్–1 డిపోలో అసిస్టెంట్ మేనేజర్ స్థాయి అధికారిణి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకున్నా.. నియమించినట్లు రికార్డులు సృష్టించి వారికి జీతాలు చెల్లించినట్లు చూపి.. ఆ జీతాల సొమ్మును కాజేసింది. చివరికి ఉద్యోగం నుంచి డిస్మిస్ అయ్యింది. తాజాగా వరంగల్ రీజియన్ కార్యాలయంలో అకౌంట్స్ విభాగం ప్రధానాధికారిణి చేతివాటం ప్రదర్శించినట్లు ప్రచారం జరుగుతోంది. అద్దె బస్సుల యజమానులకు కిలోమీటర్లు పెంచి బిల్లులు ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆర్టీసీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. 2009లో అద్దె బస్సులకు టెండర్లు పిలిచారు. ఇందులో ఈబస్సులు హనుమకొండ నుంచి హైదరాబాద్ వెళ్లి, తిరిగి హనుమకొండకు చేరుకుని ఇక్కడి నుంచి వేములవాడకు వెళ్లాలి. అయితే ఆతర్వాత హైదరాబాద్ ట్రిప్పు క్యాన్సిల్ చేసి రెండు ట్రిప్పులు వేములవాడకు తిప్పారు. హైదరాబాద్‌తో పోలిస్తే.. వేములవాడ దూరం తక్కువ. అయితే బిల్లులు మాత్రం హైదరాబాద్‌కు ఒక ట్రిప్, వేములవాడ ఒక ట్రిప్ చెల్లించుకుంటూ వచ్చారు. ఆతర్వాత 2016లో నిర్ణీత కిలోమీటర్ల కంటే అధికంగా తిరిగిన కిలో మీటర్లకు అదనపు అద్దె చెల్లించాలని అద్దె బస్సుల యజమానులు అకౌంట్స్ విభాగాన్ని సంప్రదించారు. అద్దె బస్సుల యజమానులతో మామూళ్లు ఇస్తామనే ఒప్పందం మేరకు.. మూడు బస్సులకు గాను రూ.3 లక్షలకు పైగా బిల్లులు రాగా.. అకౌంట్స్ విభాగం ప్రధాన అధికారిణికి రూ.1.40 లక్షలు ముట్టజెప్పినట్లు ఆర్టీసీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

వెలుగులోకి వచ్చిందిలా..

అద్దె బస్సుల యజమానులు హనుమకొండ నుంచి ఖమ్మంకు బస్సును తిప్పుతున్నారు. అగ్రిమెంట్ ప్రకారం ఖమ్మం పాత బస్టాండ్ వరకు బస్సును తిప్పాలి. అయితే ఖమ్మం కొత్త బస్టాండ్ వరకు బస్సు వెళ్తోంది. ఖమ్మం పాత బస్టాండ్ కంటే కొత్త బస్టాండ్ దూరంగా ఉంటుంది. దీంతో అధిక కిలోమీటర్లు తిరుగుతోంది. ఈ పెరిగిన కిలో మీటర్లకు అదనపు బిల్లు చెల్లించాలని అద్దె బస్సు యజమానులు అకౌంట్స్ విభాగం ప్రధాన అధికారిణి కలిసి కోరారు. ఆ అధికారిణి నుంచి అనుకూల స్పందన లేక పోవడంతో ఆమె గతంలో పని చేసినప్పుడు అవినీతికి పాల్పడిన విషయం బయటకొచ్చింది. ఈవ్యవహారం సోషల్ మీడియాలోనూ వైరల్ అవుతోంది. ఈఅధికారిణి రంగారెడ్డి రీజియన్‌లోనూ ఇదే విధంగా అద్దె బస్సుల యజమానులను ఇబ్బందికి గురి చేస్తే సంస్థ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తే మహబూబ్‌నగర్ రీజియన్‌కు బదిలీ చేశారు. తర్వాత జరిగిన బదిలీల్లో మహబూబ్‌నగర్ నుంచి వరంగల్ రీజియన్‌కు బదిలీ చేశారు. ఇక్కడ కూడా అద్దె బస్సుల యజమానులకు చెల్లించాల్సిన అద్దె బిల్లులు సకాలంలో చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని అద్దె బస్సుల యజమానులు తెలిపారు.

వాణి విద్యానికేతన్ హైస్కూల్ అనుమతి రద్దు

ఖిలా వరంగల్: వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటలోని వాణి విద్యానికేతన్ హైస్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న తుమ్మ కీర్తనను వ్యాయామ ఉపాధ్యాయుడు చితక బాదిన విషయం తెలిసిందే.. స్కూల్ అనుమతులు తక్షణమే రద్దు చేయాలని.. విద్యార్థి సంఘాలు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మండల విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఉపాధ్యాయుడు విద్యార్థిని ఎందుకు కొట్టాల్సి వచ్చిందనే దానిపై మండల అధికారులు విచారణ చేపట్టారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం తేటతెల్లం కావడంతో పాఠశాల అనుమతులు తక్షణమే రద్దు చేయాలని మండల విద్యాశాఖ అధికారి.. ఆర్జేడీ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వరంగల్‌కు సిఫార్సు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కోటలో విదేశీయుల సందడి



కాకతీయుల తోరణం వద్ద వియత్నాం దేశస్తులు

ఖిలా వరంగల్: హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి శిక్షణ కేంద్రం(ప్రెస్, మీడియా)లో శిక్షణ పొందుతున్న వివిధ ప్రభుత్వ సంస్థల మీడియాల్లో పని చేస్తున్న 26 మంది వియత్నాం దేశస్తులు స్టడీ టూర్‌లో భాగంగా శనివారం ఖిలా వరంగల్ కోటను సందర్శించారు. ఈసందర్భంగా వారు మధ్యకోటలోని రాతి, మట్టికోట అందాలు, గుండు చెరువు, ఖుష్ మహల్, శృంగారపు బావి, నాలుగు తోరణాల్లోని నాటి శిల్పులు నల్ల రాతిలో చెక్కిన అద్భుతం శిల్ప కళా సంపదను కెమెరాల్లో బంధించారు. కాకతీయుల విశిష్టత, నిర్మాణ శైలిని పర్యాటక శాఖ గైడ్ కిరణ్ ప్రకాశ్ వారికి వివరించారు. వారి వెంట హైదరాబాద్ డాక్టర్ ఎంసీబీ హెచ్ ఆర్‌డీ ఫ్యాకల్టీ డాక్టర్ కె.సురేశ్‌కుమార్ శ్రీనివాస్, డీపీఆర్‌ఓ అయూబ్ ఆలీ, ప్రాంతీయ శిక్షణ కేంద్రం మేనేజర్ కుమారస్వామి, సీఐ మల్లయ్య, ఎస్సై గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి


శ్రీధర్(ఫైల్)

హసన్‌పర్తి: హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిలోని బావుపేట క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి చెందాడు. ఈమేరకు బాధిత కుటుంబసభ్యులు శనివారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన పత్తిపాక శ్రీధర్(40) వృత్తి రీత్యా ఫొటోగ్రాఫర్. శ్రీధర్‌కు భార్య కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా, శుక్రవారం హనుమకొండలో జరిగిన ఓ పెళ్లి వేడుకలో పాల్గొని.. మధ్యాహ్నం బైక్‌పై హనుమకొండ నుంచి కమలాపూర్‌కు బయల్దేరాడు. ఈ క్రమంలో బావుపేట క్రాస్ వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో హనుమకొండ నుంచి కరీంనగర్ వైపు వెళ్లే కారు అతివేగంగా వచ్చి శ్రీధర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీధర్ తలతోపాటు కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు.కాగా, ఎస్సార్ కళాశాలకు చెందిన ఇషాంత్ అనే యువకుడు ప్రమాదానికి కారణమని మృతుడి సోదరుడు తెలిపారు. ఈమేరకు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా.. శ్రీధర్ మృతితో అతని పిల్లలు అనాథలయ్యారు. పనిచేస్తే తప్ప పూట గడవని కుటుంబ పెద్ద మృతితో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

పాము కాటుతో వ్యక్తి ..


మల్లయ్య(ఫైల్)

పర్వతగిరి: పాటు కాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అక్కల మల్లయ్య (55) గత ఐదు రోజుల క్రితం తన పంట పొలానికి నీళ్లు పారిస్తుండగా.. పాము కాటు వేసింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు వినయ్, నగేష్ ఉన్నారు. మల్లయ్య భార్య మనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు..


వెంకటయ్య(ఫైల్)

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన కుసుమ వెంకటయ్య(65) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పుల గ్రామానికి చెందిన వెంకటయ్య కొద్దిరోజులుగా వెన్నునొప్పి, పక్షపాతంతో బాధపడుతున్నాడు. బాధను భరించలేక ఈ నెల 22న పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వెంకటయ్య కుమారుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కృత్రిమం వద్దు.. సహజమే ముద్దు

●రసాయన రంగులతో హోలీ వేడుకలు ● అనారోగ్య సమస్యలు తప్పవంటున్న నిపుణులు

జనగామ రూరల్/మహబూబాబాద్ రూరల్: కాముని దహనం మరుసటి రోజు చిన్నాపెద్ద తేడా లేకుండా రంగుల్లో మునిగితేలుతూ హోలీ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ. అయితే ప్రస్తుతం సాంకేతిక అభివృద్ధి.. బిజీ లైఫ్‌తో ఎవరూ సహజరంగులను తయారు చేసుకోకుండా.. కేవలం మార్కెట్‌లో లభిస్తున్న కృత్రిమ రంగులతోనే హోలీ వేడుకల్లో ఎంజాయ్ చేస్తున్నారు.. కానీ, ఈ కృత్రిమ రంగులతో హోలీ ఆడుకుని శరీరానికి పూసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తప్పవంటున్నారు వైద్య నిపుణులు. ప్రధానంగా చర్మ సంబంధిత వ్యాధులతో పాటు కంటి చూపు కోల్పోయే ప్రమాదం లేకపోలేదని చెబుతున్నారు. అందువల్ల రసాయన రంగులను కాకుండా సహజసిద్ధమైన రంగులతో వేడుకలను జరుపుకోవాలని సూచిస్తున్నారు. ప్రమాదకరమైన రసాయన రంగులకు బదులు గోరింటాకు పొడి, కుంకుమ, పసుపు, టమాటా గింజలు, మోదుకు పూల పొడితో తయారు చేసిన రంగులను హోలీలో ఉపయోగించడం వల్ల చర్మానికి ఇబ్బంది లేకుండా ఉంటుందని చెబుతున్నారు.

నిర్లక్ష్యాన్ని వీడాలి

హోలీ ఆనందం కుటుంబంలో విషాదం నింపకుండా చూసుకోవాలి. ఏటా.. ఏదో ఒక చోట చెరువులు, వాగులు, కుంటల వద్దకు స్నానం కోసం వెళ్లి యువత మృత్యువాత పడుతున్నారు. చెరువులు, జలాశయాల వద్ద సెల్ఫీలు, సరదాలకు పోయి.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. హోలీ రోజున జాగ్రత్తలు పాటిస్తే నిండుజీవితాన్ని ఆనందంగా గడపవచ్చు.


చౌడారంలో ముందస్తు హోలీ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

జాగ్రత్తలు..

- ఈత రాకుండా నీటిలో దిగకూడదు.
- చెరువులోతు తెలియకుండా ఈత కొట్టడం.. నీటిలో విన్యాసాలు చేయడం సరికాదు..
- ఈత వచ్చినా.. ఎక్కువ సమయం నీటిలో ఉండొద్దు.
- సమీపంలో ఎవరైనా నీటిలో మునిగిపోతుంటే.. వారిని జుట్టు మాత్రమే పట్టుకుని బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేయాలి.
- మద్యం సేవించిన తర్వాత ఈత కొట్టకపోవడమే మేలు.
- రసాయన రంగులను చెరువులు, కుంటల్లో కడుక్కోవడంతో నీటి కాలుష్యం జరుగుతుంది.

సూచనలు

హోలీ ఆడదానికి ముందు ముఖానికి మాయిశ్చరైజర్, తలకు నూనె రాసుకోవడం ఉత్తమం.

- రంగుల్లో ఆయిల్స్ లేదా నీటిని కలపకుండా హోలీ ఆడితే నీటి వృథాను అడ్డుకోవచ్చు.
- ఎరుపు రంగు కోసం బీట్‌రూట్, మోదుగు పూలు, గులాబీ, మందారం వాడాలి.
- పసుపు రంగు కోసం పసుపు, ఆకుపచ్చ రంగు కోసం ఆకుకూరల మిశ్రమం వాడొచ్చు.
- సహజ రంగుల్లో లభించే యాంటీయాక్సిడెంట్లు చర్మవ్యాధులను నియంత్రించి, చర్మాన్ని మృదువు చేస్తాయి.



కృత్రిమ రంగులతో ఇబ్బందులు..

- నలుపులో లెడ్ ఆక్సైడ్ మూత్రపిండాల వైఫల్యాలకు దారితీస్తుంది.
- కృత్రిమ ఆకుపచ్చ రంగుతో కాపర్ సల్ఫేట్ కంటి దురద, వాపు వైఫల్యాలకు దారితీస్తుంది.
- వెండి రంగు అల్యూమినియం బ్రోమైడ్ క్యాన్సర్ కారకం.
- నీలి రంగు పుసియన్‌బ్లూ చర్మ సంబంధ వ్యాధులు, మెర్క్యూరీ సల్ఫేట్ (ఎరుపు) క్యాన్సర్‌కు కారణమవుతాయి.
- పౌడర్లు, గులాల్, లెడ్, క్రోమియం, నికెల్, మెర్క్యూరీ, కాపర్, జింక్, వినికిడి లోపం, ఎలర్జీ, ఆయాసం మొదలగు దుష్పలితాలకు దారితీస్తాయి.

ప్రజల్లో మార్పునకు కృషి..



హోలీ పండుగను పురస్కరించుకుని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది ప్రజల్లో మార్పు కోసం కృషి చేస్తున్నాం. సహజసిద్ధ రంగులు వాడి, రసాయన రంగులను మానుకోవాలి. ఇందులో భాగంగా నెహ్రూ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– లింగంపల్లి దయానంద్, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి, మానుకోట

సహజరంగులే వాడాలి



హోలీ వేడుకల్లో సహజరంగులనే వాడాలి. రసాయన రంగులు కళ్లలో పడితే చూపు దెబ్బతింటుంది. ప్రకృతిలో లభించే పూలు, ఆకులు, ఇతరత్రా వాటితో తయారయ్యే రంగులను వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. తద్వారా పర్యావరణాన్ని కూడా కాపాడినట్టే..

– గురునాథరావు, దిశ సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు

రసాయన రంగులు వాడొద్దు..



పండగ మోజులో కెమికల్స్ కలిపిన కలర్లను వాడితే ప్రమాదం తెచ్చుకున్నట్టే. రంగుల నుంచి వచ్చే పొగ పీల్చుకోవడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలతోపాటు శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బంది తప్పదు. రంగులు కంటిలో పడితే శాశ్వత అంధకారం సైతం రావచ్చు. స్కిన్ ఎలర్జీకి సైతం గురవుతారు. సహజసిద్ధ రంగులతో ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– డాక్టర్ వనం శ్రీనివాస్, ఎండీ.సివిల్ సర్జన్, జనగామ

ప్రాణాలతో చెలగాటం వద్దు



రంగుల పండగ పూర్తయిన తర్వాత చాలామంది యువకులు, పెద్దలు స్నానం చేసేందుకు చెరువులు, బావులు, జలాశయాల వద్దకు వెళ్తుంటారు. అలాకాకుండా ఇంటివద్దనే రంగులను కడుక్కోవడం ఉత్తమం. చెరువులు, బావుల వద్దకు వెళ్లి, ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

– సీతారాం, డీసీపీ, జనగామ

గంజాయి మత్తులో మైనర్ల హల్‌చల్

● దూపకుంట రోడ్డులో బాలికలపై ఈవ్‌టీజింగ్

వరంగల్: వరంగల్ నగరంలోని శంభునిపేటలో ఆకతాయిలు పెట్రేగిపోతున్నారు. సాయంత్రం ఆరు దాటిందంటే గంజాయి, మద్యం మత్తులో 16 ఏళ్ల మైనర్లే ఊగిపోతున్నారు. వీరు దారిన వెళ్లే బాలికలను ఈవ్ టీజింగ్ చేస్తూ భయాందోళకు గురిచేస్తున్నారు. అర్ధరాత్రి వరకు ఆకతాయిల బ్యాచ్‌గా ఏర్పడి శంభునిపేట వీధుల్లో సంచరిస్తూ బెదిరింపులకు తెగపడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇదే తరహా ఘటన శుక్రవారం రాత్రి దూపకుంట రోడ్డులో జరిగింది. నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న ఓ మైనర్ బాలికను నిలిపి ఈవ్‌టీజింగ్‌కు పాల్పడ్డారు. బాలిక తల్లిదండ్రులు మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందించగా.. శనివారం ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆకతాయిలను గుర్తించి తమదైన శైలిలో విచారించేందుకు పోలీసులు సిద్ధమైనట్లు తెలిసింది. ఆకతాయిలు ఆగడాలు ఎక్కువకావడంతో రాత్రి అయిందంటే రోడ్డుపై నడవా లంటేనే బాలికలు వణికిపోతున్నారని.. పోలీసులు నిఘా పెంచాలని, స్థానికులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

ఖానాపురం : వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్‌లో శనివారం వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్‌నగర్ గ్రామానికి చెందిన బాదరబోయిన వెంకన్న(35) కొద్ది సంవత్సరాలుగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు, భార్య పిల్లలను నిత్యం ఇబ్బందులకు గురి చేస్తుండటంతో మరో చోట నివసిస్తున్నారు. ఈ క్రమంలో ఒంటరిగానే నివసిస్తూ శుక్రవారం రాత్రిఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి తల్లి సత్తెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

తల్లీబిడ్డల ఆత్మహత్యపై కేసు నమోదు


ప్రాణాలతో బయటపడిన బాలుడు ముఖేష్

నెల్లికుదురు: తల్లీ కూతుర్ల ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని శ్రీరామగిరి శివారు వెంకటాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి క్షణికావేశానికి లోనైన తల్లి.. కొడుకు, కూతురును వ్యవసాయ బావిలో తోసేసి తను కూడా దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటనలో తల్లి కూతురు మృతి చెందగా.. కుమారుడు ప్రాణాలతో బయటపడిన విషయం తెలిసిందే. వెంకటాపురం గ్రామానికి చెందిన ఆకుల మురళి లావణ్య దంపతులు శుక్రవారం రాత్రి ఓ ఫంక్షన్‌కు వెళ్లేవిషయంలో గొడవపడ్డారు. వద్దని చెప్పినా.. ఫంక్షన్‌కు ఎందుకు వెళ్లావని భర్తపై కోపంతో లావణ్య(30) ఇద్దరు పిల్లలు ముఖేష్, నిత్యశ్రీ (6)తో వెళ్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ బావిలో దూకింది. ఈఘటనలో బాలుడు ముఖేష్ ప్రాణాలతో బయటపడ్డాడు. మృతురాలి సోదరి ఆకుల రజిత ఫిర్యాదు మేరకు నమోదు చేసి మృతదేహాలను ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

బాలుడిని కాపాడిన ఈత

తల్లి లావణ్య కుమారుడు ముఖేష్, కూతురు నిత్యశ్రీలతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు బావిలో దూకింది. ఈక్రమంలో ఈత వచ్చిన ముఖేష్.. తల్లి చెల్లి బావితో మునిగిపోగా ఆ రాత్రి చీకట్లో ధైర్యం చేసి 30ఫీట్ల లోతులో నుంచి ఓడలపై ఉన్న కడ్డీలను పట్టుకుని పైకి ఎక్కాడు. ఈక్రమంలో రెండు సార్లు మళ్లీ బావిలో పడినట్లు తెలిసింది. విద్యుత్ మోటార్ వైరును పట్టుకుని పైకి వచ్చి గ్రామస్తులకు విషయం చెప్పినట్లు తెలిసింది.

పెళ్లి ఆలస్యం అవుతుందని యువకుడి ఆత్మహత్య


మహేశ్ (ఫైల్)

ఏటూరునాగారం: తన వివాహం జరగడంలో ఆలస్యాన్ని జీర్ణించుకోలేని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రొయ్యూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. రొయ్యూర్ గ్రామానికి చెందిన మోతె బాబు కుమారుడు మోతె మహేశ్ (24)కు.. తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన ఓ యువతితో వివాహం నిశ్చమైంది. పూలుపండ్లు(నిశ్చితార్థం) పెట్టుకుందామనుకున్న సమయంలో అమ్మాయి తండ్రి తన వద్ద ఇప్పుడు డబ్బులు లేవని, ఏడాది తర్వాత వివాహం జరిపిస్తామని చెప్పారు. దీంతో తనకు వివాహం జరుగుతుందో.. లేదోనని మనస్తాపానికి గురైన మహేశ్ రొయ్యూర్ గ్రామ సమీపంలోని మిర్చితోటకు వెళ్లి పురుగుల మందుతాగి అక్కడే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేశ్ తండ్రి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు

● మైనర్‌పై లైంగిక దాడికి కేసులో ఉత్తర్వులు..


సంపత్‌కుమార్

వరంగల్ క్రైం: మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించి పోక్సో కేసులో అరెస్ట్ అయిన భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ బండారి సంపత్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం మల్టీజోన్ -1 ఐజీ ఏ.వీ.రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ కేయూసీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించే సమయంలో స్టేషన్ పరిధిలో నివాసముంటున్న ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. ఇన్‌స్పెక్టర్ సంపత్ పరిచయంతో మహిళ కాపురంలో గొడవలు రావడం.. భర్తతో దూరమైన మహిళతో ఇన్‌స్పెక్టర్ సంపత్‌కుమార్ సహజీవనం సాగిస్తున్నాడు. దీనితో సదరు మహిళ భర్త గతంలో సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయగా సంపత్‌కుమార్‌ను వీఆర్‌కు అటాచ్ చేశారు. కొద్ది రోజుల తర్వాత సంపత్‌కుమార్‌కు ఇన్‌స్పెక్టర్ పదోన్నతిపై భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ సంపత్ కుమార్ తరచూ మహిళ వద్దకు వస్తూపోతున్న క్రమంలో సంపత్ దృష్టి మహిళ కుమార్తెపై పడింది. ఇటీవల సంపత్‌కుమార్ ఆబాలికపై అత్యాచారానికి యత్నించాడు. దీంతో కుమార్తె తల్లి కేయూసీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం ఇన్‌స్పెక్టర్‌పై ఫోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

మానుకోట డీఆర్‌డీఓ పురుషోత్తం..

భూపాలపల్లి రూరల్/మహబూబాబాద్ అర్బన్ : నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే అభియోగంతో మహబూబాబాద్ డీఆర్‌డీఓ పురుషోత్తంను సస్పెండ్ చేస్తూ.. పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానీయ ఉత్తర్వులు జారీచేశారు. గతంలో జయశంకర్ భూపాలపల్లిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆర్థిక అంశాలకు సంబంధించిన రికార్డులను ప్రభుత్వానికి అందించకపోవడంతో సస్పెన్షన్‌వేటు వేసినట్లు సమాచారం. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడనే అభియోగంతో 22సెప్టెంబర్ 2023వ తేదీన సెర్ప్ డైరెక్టర్ గోపాల్‌రావు ఆధ్వర్యంలో ఆరుగురు అధికారుల బృందం భూపాలపల్లి డీర్‌డీఓ కార్యాలయంలో విచారణచేపట్టారు. ఉపాధి హామీ పనుల రికార్డులతోపాటు, సెర్ప్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అవినీతిపై పలువురు అధికారులను విచారించారు. ప్రభుత్వ 58 జీఓను లెక్క చేయకుండా 2021నుంచి 2023 వరకు మహిళలకు బదులుగా ఐదుగురు పురుషులను వీఓఏలుగా నియమించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఉపాధి హామీ నిధుల దుర్వినియోగం, పలు అవకతవకలపై డీఆర్‌డీఓపై సస్పెన్షన్ వేటు పడినట్లు జిల్లాలోని అధికారులు సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఉన్నత స్థాయి అధికారితోపాటు మరో ఇద్దరు కింది స్థాయి సిబ్బంది కూడా పురుషోత్తంకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. వారిపై కూడా వేటు పడే అవకాశం లేకపోలేదని చర్చ జరుగుతోండడం గమనార్హం. ఇదిలా ఉండగా.. అదనపు కలెక్టర్ లెలిన్ వత్సల్ టొప్పోకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


సుప్రియ(ఫైల్)


దుగ్గొండి: బెడ్‌పై విగతజీవిగా సుప్రియ

దుగ్గొండి: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన సుప్రియ(27)కు దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామానికి చెందిన వెంగల కిరణ్‌కు ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు 5ఏళ్ల బాబు, 4ఏళ్ల పాప ఉన్నారు. కిరణ్ ప్రతిరోజు వరంగల్‌కు వెళ్లి ఓ మొబైల్ షాపులో పనిచేసి వస్తుండేవాడు. సుప్రియ ఇంట్లోనే ఉండేది. ఈక్రమంలో శనివారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన చిన్నారులకు తల్లి సుప్రియ బెడ్‌పై విగతజీవిగా కనిపించింది. ఎంత పిలిచినా పలకక పోవడంతో వారు బయటికి వచ్చి పక్కింటి వారికి చెప్పారు. వారు వెళ్లి చూడగా సుప్రియ అప్పటికే మృతి చెంది ఉంది. ఇంట్లోని బీరువా తెరుచుకుని ఉండటంతోపాటు సుప్రియ ఒంటిపై మంగళసూత్రాలు, చెవిదుద్దులు లేవు. ఇంట్లో బిర్యాని తిన్న ఆనవాళ్లు ఉన్నాయి. దీంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ రాజగోపాల్, ఎస్సై పరమేష్ సంఘటన స్థలానికి చేరుకుని డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలను పిలిపించి విచారణ చేస్తున్నారు.

దొంగలా.. తెలిసిన వారే హత్య చేశారా..?

సుప్రియ ఇంట్లో బిర్యాని ప్యాకెట్ లభించడం, సుప్రియ మృతదేహంపై గాయాలు ఉండటం.. గాజులు పగిలిపోయి ఉండటంతో అసలు సుప్రియ ఇంటికి ఎవరు వచ్చారు.. ఎంత మంది వచ్చారు.. అత్యాచారం చేసి హత్య చేశారా.. తెలిసిన వారే చేశారా.. అనే కోణంలో విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఇంట్లోని బీరువా డోర్‌లు తెరిచి ఉండటం, సుప్రియ శరీరంపై బంగారం మాయం కావడంతో దొంగలు వచ్చి అఘాయిత్యానికి పాల్పడ్డారా.. అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే మధ్యాహ్నం సమయంలో సుప్రియ ఇంటికి ఎరుపు రంగు ద్విచక్ర వాహనంపై ఎవరో వచ్చారని బంధువులు కావచ్చునని తాము అనుకున్నామని చుట్టుపక్కల వారు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సుప్రియ ఇళ్లు నీరుకుళ్ల రోడ్డులో కొంత మేర ఒంటరిగా ఉంది.

అమ్మ కోసం.. చిన్నారుల ఆక్రందన..

ఇద్దరు చిన్నారులకు తమ అమ్మ చనిపోయిందనే విషయం తెలియక వారు బిత్తర చూపులు చూస్తూ.. ఏడుస్తుండడంతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. అఘాయిత్యానికి ఒడిగట్టిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

కాపర్ వైర్ల చోరీ


దుండగులు పగులకొట్టిన ట్రాన్స్‌ఫార్మర్

జనగామ రూరల్: మండలంలోని వడ్లకొండ గ్రామంలోని వంగాల మల్లారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్‌ను దొంగిలించారు. నెల రోజుల వ్యవధిలో పది గ్రామాల్లో కాపర్ వైర్ చోరీలు పెరిగిపోతున్నాయని.. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం సమయంలో వ్యవసాయ బావి వద్దకు వెళ్లాలంటే చెడ్డీ గ్యాంగ్ దుండగులు వస్తారేమోనని భయపడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో పెట్రోలింగ్ పెంచాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

అప్పు తీర్చేందుకే దొంగతనం

● హైదరాబాద్ ఘటన నిందితుడు సుశీల్
● వివరాలు వెల్లడించిన ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు


పట్టుబడిన దుండగుడు సుశీల్‌కుమార్

కాజీపేట రూరల్: హైదరాబాద్ బేగంపేట రసూల్‌పుర చోరీ ఘటనలో పారిపోయి కాజీపేట జంక్షన్‌లో గురువారం రాత్రి పట్టుబడ్డ దుండగుడు సుశీల్ కుమార్ గురించి కాజీపేట ఆర్పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సంజీవరావు శనివారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్, కాన్పూర్‌కు చెందిన సుశీల్ కుమార్‌ది వ్యవసాయ కుటుంబం. కుటుంబ పోషణకు చేసిన రూ.2లక్షల అప్పు ఉంది. రోజు కూలికి వెళ్తే రూ.300 మాత్రమే వస్తున్నాయని, ఇది చాలకపోవడంతో హైదరాబాద్‌కు వచ్చి అక్కడక్కడా పని చేసి రసూల్‌పూరలో ఒక నార్త్ ఇండియా వారి ఇంట్లో క్లీనింగ్ పని చేశాడు. ఆ ఇంట్లో తల్లీ, కూతురు మాత్రమే ఉండడంతో కొంత కాలం తర్వాత పని మానేసి ఆ ఇంట్లోనే చోరీకి పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో మరో వ్యక్తితో చోరీకి యత్నించి విఫలమైనట్లు పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా బేగంపేట ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా ఇచ్చిన సీసీ ఫుటేజీ ఆధారంగా కాజీపేట ఆర్పీఎఫ్ పోలీసులను అప్రమత్తం చేసినట్లు సీఐ తెలిపారు. దుండగుడు శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లో కాజీపేట జంక్షన్‌లో దిగి ఉత్తరప్రదేశ్‌కు వెళ్లేందుకు సిద్ధం కాగా.. కాజీపేట ఆర్పీఎఫ్ ఎస్సై శ్రావణి, సరీశ్, రమేష్‌లు అనుమానస్పదంగా కనిపించిన దుండగుడిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. దేశీ గన్, డెటాల్, రిన్ సబ్బు చిన్నగా కట్‌చేసిన బిల్లలు, రూ 3,600నగదు, రెండు ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అన్ని విధాలుగా విచారించి బేగంపేట పోలీసులకు దుండగుడు సుశీల్‌ను అప్పగించినట్లు తెలిపారు.

గృహప్రవేశానికి ముందురోజే మృత్యుఒడిలోకి..

● విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


వెంకన్న మృతదేహం

పర్వతగిరి: నూతనంగా నిర్మించుకున్న ఇంట్లో అడుగుపెట్టకుండానే ఆ వ్యక్తి పరలోకానికి పయనమయ్యాడు.. తెల్లారితే గృహప్రవేశం, దుర్గమ్మ పండుగతో సందడిగా ఉండాల్సి ఇల్లు.. బంధువుల కన్నీటి రోదనతో విషాదంతో నిండింది.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామ శివారు ముంజాలకుంటతండాకు చెందిన రమావత్ వెంకన్న(35) శనివారం కరెంటు మోటారు రిపేరు చేస్తున్నాడు. ఈ క్రమంలో మోటారుకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందాడు. వెంకన్నకు భార్య జ్యోతి, కూతురు రవళిక ఉన్నారు. జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. కాగా, బాధిత కుటుంబాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ పరామర్శించి, సంతాపం తెలిపారు. ఆయన వెంట గ్రామ పార్టీ అధ్యక్షుడు జాటోతు రవి, తిరుపతి, ముదురుకుల్ల రమేష్, తదితరులు ఉన్నారు.